క్లుప్తంగా

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

దేవీపట్నం: మండలంలోని శరభవరంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. శరభవరం సచివాలయం పరిధి పోతవరం, చిన్నారిగండి గ్రామాల్లో గడప ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొనాలని తెలిపారు.

'సంపద కేంద్రం' పరిశీలన

రంపచోడవరం: మండలంలో తామరపల్లి గ్రామ సచివాలయం లోని చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని మంగళవారం డీఎల్‌పీవో జి.వి.ఎల్.ఎస్.వి. రాఘవన్ పరిశీలించారు. షెడ్ నాలుగు వైపులా చుట్టూ ఉన్న ప్రదేశంలో మొక్కలు నాటాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ ద్వారా వచ్చే ఆదాయం అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలన్నారు. ఇంటిపన్నులు 100శాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సచివాలయం రికార్డులు తనిఖీ చేసి గ్రామ సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

తారు రోడ్డు పనుల పరిశీలన



హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో అతి మారుమూల పంచాయతీ బస్కి పరిధిలో గాగువలస నుంచి మొర్రిగూడ వరకు నిర్మిస్తున్న తారు రోడ్డును సర్పంచ్ పాడి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో రోడ్డు నిర్మాణం జరుగుతోందని చెప్పారు. దీంతో ఎన్నోఏళ్ల కల నేరువేరుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రామచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు జగన్,రామన్న, మొద్దు, సొన్ను, దొన్ను, అప్పలస్వామి,రాంబాబు, రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఎంపీడీవో రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైస్‌ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: మండలంలో అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ కోరారు. ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో రమేష్‌కు మంగళవారం గిరిజన సంఘం నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో 23 పంచాయతీలలో 18 గ్రామ సచివాలయాల పరిధిలో 375 గ్రామాలు ఉన్నాయని, ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండలంలో మరో ఐదు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను పాల్గొన్నారు.

ఎంపీడీవోకు అభినందనలు

కొయ్యూరు: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన లాలం సీతయ్యను మంగళవారం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలి నాయుడు,మరి కొందరు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల కోసం అంతా పనిచేయాలని సూచించారు.

అన్నదాతకు అండగా..

- వరుసగా ఐదోసారి రైతు భరోసా నగదు జమ
- ముంచంగిపుట్టు మండలంలో 8,932 మందికి లబ్ధి
- పెట్టుబడికి ఢోకా లేదంటూ రైతుల హర్షం



ముంచంగిపుట్టు: గత ప్రభుత్వాల హయాంలో సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని వ్యవసాయ పెట్టుబడులు పెట్టవలసిన పరిస్థితి ఉండేది. దీంతో అధిక రుణ భారంతో రైతన్నలు చితికిపోయేవారు. వారి సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టి ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఈ ఏడాది కూడా సాగుకు పెట్టుబడికి సాయం అందజేశారు. మొత్తం రూ.13,500 సాయాన్ని మూడు విడతల అందజేస్తారు.

వరుసగా ఐదో ఏడాది సైతం వైఎస్సార్ రైతు భరోసా నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ముంచంగిపుట్టు మండలంలో ఏడు ఆర్‌బీకేల పరిధిలో మొదటి విడతలో 8,932 మంది రైతులకు రూ.2.14కోట్ల సాయం అందింది.దీంతో ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడికి ఢోకా ఉండదని అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

మండలంలో రైతు భరోసా వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు(రూ.లో)
2019-20	6,660	8.99కోట్లు
2020-21	8,232	11.11 కోట్లు
2021-22	8,945	12.07 కోట్లు
2022-23	8,862	11.96 కోట్లు
2023-24	8,932	2.14 కోట్లు (మొదటి విడత)

అప్పుల బాధ తప్పింది

గతంలో వ్యవసాయ సీజన్ వస్తుందంటే అప్పులకోసం పరుగులు తీయవలసిన పరిస్థితి ఉండేది. వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రైతులకు పూర్తి భరోసా లభిస్తోంది.రైతు భరోసాతో అప్పు చేయాల్సిన ఇబ్బంది లేకుండా సాగు చేయగలుగుతున్నాం.పెట్టుబడి సాయం అందజేయడంతో చాలా ఆనందంగా ఉంది. – పి.మురళి, గిరిజన రైతు, సుజనపేట, ముంచంగిపుట్టు మండలం

ఎంతో ఉపయోగం

ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.రైతులకు జగనన్న ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో వ్యవసాయానికి సహాయం చేస్తున్నారు. – ఎస్.నాగేశ్వరరావు, మర్రిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

అర్హులందరికీ భరోసా

మండలంలోని ఏడు ఆర్బీకేల పరిధిలో 8,932 మంది రైతులకు రైతు భరోసా నగదు జమ అయింది. దీనికి తోడు వ్యవసాయంలో ఏ పంటలు వేస్తే ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందో సూచనలు చేస్తున్నాం.రైతు భరోసాతో పాటు ఈ ఏడాది ముందస్తుగానే విత్తనాలు పంపిణీ సైతం పూర్తి చేశాం. -ఎం.శ్రీనివాసరావు,ఏవో

అధికారులు లేని సమావేశాలెందుకు?

మండల సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



సమావేశాన్ని బహిష్కరించి వెళుతున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

జి.మాడుగుల: మండల పరిషత్ సమావేశానికి అధికారులు గైర్హాజరవడంతో ఆగ్రహించిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. అధికారులు లేకుండా నిర్వహించడమెందుకని వారు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ అధ్యక్షురాలు కె.పద్మ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం ప్రారంభించారు.జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఎంపీడీవో చంద్రశేఖరరావు శాఖల వారీగా సమీక్ష నిర్వహించబోతుండగా మండల స్థాయి అధికారులు గైర్హాజరవడాన్ని గమనించిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు రాకపోతే సమావేశాలు ఎందుకు నిర్వహించడమని నిరసన వ్యక్తం చేస్తూ సభను బహిష్కరించారు. గత మూడు సమావేశాల నుంచి అధికారులు గైర్హాజరవుతున్నారని, అయితే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. మూడు నెలలకోకమారు జరిగే మండల పరిషత్ సమావేశానికి పూర్తి స్థాయిలో మండల స్థాయి అధికారులు హాజరు కాకపోతే ప్రజా సమస్యలు, ఇబ్బందులు, ఎవరికి చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు.సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కె.సత్యనారాయణ, కల్యాణి, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, వంతాల మధు,అంగనైయిని నానాజీ, చిన్నారావు, అప్పారావు, పాంగి లక్ష్మి, ఈశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు కిముదు రాంబాబు,ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, చినకుమారి,మసాడి రాజులమ్మ,కొర్ర రవనీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



రాజవొమ్మంగి బాలికల గురుకుల పాఠశాలలో కిట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



జేవీకే కిట్లు అందుకున్న గురుకుల పాఠశాల చిన్నారులతో తల్లిదండ్రులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో ఐదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 480 మంది చదువుతున్నారు. వీరందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశామని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పాఠశాలలో ఇటీవల ఐదవ తరగతిలో 80 మంది గిరిజన చిన్నారులకు ప్రవేశానుమతి లభించింది. ఒక్కొరొక్కరుగా పాఠశాలకు వస్తున్న వారికి ఉపాధ్యాయులు జగనన్న కిట్లు ఇస్తుండటంతో వారి ముఖంలో ఆనందం తొణికిసలాడింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వై.రామవరం: వెలుగుద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ తప్పని సరిగా అందించాలని వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాస్ మండల వెలుగు సిబ్బందికి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా సంఘాల అభివృద్ధికోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్ని పథకాలను అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంత వరకు వెలుగుద్వారా అందించిన రుణాల వివరాలను తెలుసుకున్నారు. 13 సంఘాలకు నిలిచిపోయిన ఆసరా నగదు ఆ సంఘాల ఖాతాలకు జమఅయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం కామరాజు, ఐబీ డీపీఎం బి. అపర్ణ, స్థానిక వెలుగు ఏపీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో సంక్షేమ విప్లవం

'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మర్రిపాలెంలో గిరిజనులకు బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మర్రివాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో వంజరి-2 సచివాలయంలో పరిధిలో మర్రిపాలెం, వెన్నెలకోట, కినగరి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 130 గడపలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపకు వెళ్లి ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో అర్హత ఉండి ఇప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారుంటే స్థానిక గ్రామ సచివాలయాలను సంప్రదించి, పథకాలు పొందాలని ఆమె సూచించారు. గిరిజన గ్రామాల మధ్య ఉన్న కాలువలపై బ్రిడ్జిలు, కల్వర్టులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. కల్వర్టుల నిర్మాణాలకు తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమమవుతుండడం చారిత్రాత్మకమని ఆమె అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఆమె చెప్పారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు శాయశక్తులు ప్రత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొర్రా రవని, ఎంపీటీసీలు వంతాల మధు, చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, సచివాలయ మండల కన్వీనర్ ఎల్.కల్యాణ్,సచివాలయ కన్వీనర్లు బి.బాలయ్య, మత్స్యకొండ, సోషల్‌మీడియా కన్వీనర్ లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీనాయకుడు సన్యాసిరావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో సంతృప్తిగా ప్రజలు

రంపచోడవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ తెలిపారు. మండలంలో మర్రివాడ, కుంజం వీధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఏజెన్సీలో అర్హులైన ప్రతి గిరిజన రైతు పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి, రైతు భరోసా అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నాడు-నేడు ద్వారా ఏజెన్సీలో అనేక పాఠశాలలను అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైఎస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్,అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజ, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి అండగా ఉంటాం

ఎంపీపీ రంజపల్లి ఉషారాణి



దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నేతలు

అరకులోయ రూరల్: వర్షాలకారణంగా చెట్లు పడి ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరపున అండగా ఉంటామని ఎంపీపీ ఉషారాణి తెలిపారు. సోమవారం కురిసిన భారీ వర్షం కారణంగా మండలంలో కొత్తభల్లుగూడ పంచాయతీ సొర్లయిగూడ గ్రామంలో పాంగి నాగేష్,పాంగి విజయ్,పాంగి గోపాల్, పాంగి మొత్తిలకు చెందిన నాలుగు రేకుల ఇళ్లపై చెట్లు పడడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. మంగళవారం ఎంపీపీ ఉషారాణి,వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్‌కుమార్, సర్పంచ్ రాధిక, రెవెన్యూ అధికారులు ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పైకప్పులు వేసుకునేందుకు రూ.50 వేలతో సిమెంట్ రేకులను పార్టీ తరపున అందజేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన పరిహారం వెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి హస్తినకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు రామూర్తి,నర్సింగ్,అర్జున్,గోపాల్,ఆర్‌ఐ సత్యనారాయణ,వీఆర్వో జయంతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏవోగా శ్రీనివాసబాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: మండల వ్యవసాయాధికారిగా మొజ్జాడ శ్రీనివాసబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏవోగా పని చేసిన పాలిమేర మోహన్‌రావు బదిలీపై యలమంచిలి వెళ్లారు.

మానసిక రోగులకు వైద్య పరీక్షలు



మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామిరెడ్డి

గంగవరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మానసిక రోగుల కోసం ప్రతి నెలా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన తెలిపారు. మంగళవారం ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో పది మంది మానసిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు ఆమె చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ కెవిన్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాలొన్నట్టు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

పెదబయలు: మండల కేంద్రం పెదబయలులో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత శ్రీనివాసరావు,స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య,ఎంఈవో సింహాచలం,ఆలయ కమిటీ సభ్యులు లొట్టి త్రినాథరావు,కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న సాయిరాం స్వామీజి

జి.మాడుగుల: సొలభం పంచాయతీ కొత్త కుండలు గ్రామంలో మంగళవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని భీమిలి సద్గురు సేవాశ్రమం సాయిరాం స్వామీజి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రచార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు, గ్రామ పెద్దలు జి.బాలంనాయుడు, పెద్దబ్బాయి పాల్గొన్నారు.